సాక్షి
వికారాబాద్
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



'ఉత్త'మ పంచాయతేనా..?
ఇటీవల ప్రకటించిన ఉత్తమ పంచాయతీల అవార్డుల ప్రదానం.. పలుచోట్ల విమర్శలకు తావిస్తోంది.
8లో▸



వికారాబాద్ అర్బన్: శివారెడ్డిపేట్ సెంటర్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, డీఈఓ రేణుకాదేవి





వికారాబాద్ అర్బన్: పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

13,271 మంది హాజరు

తాండూరులో పేపర్ లీక్ కలకలం మినహా జిల్లా వ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని సైతం అనుమతించడంతో విద్యార్థులెవరూ పరీక్ష మిస్ కాలేదు. జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 13,266 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 13,200 మంది, 91 మంది బ్యాక్‌లాగ్ విద్యార్థులకు 71 మంది హాజరయ్యారు. వికారాబాద్‌లోని శివారెడ్డిపేట్ సెంటర్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి, డీఈఓ రేణుకాదేవి తనిఖీ చేశారు.

– వికారాబాద్ అర్బన్



పెద్దేముల్: బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

కుల్కచర్లలో కరోనా పరీక్షలు

ఒకరికి పాజిటివ్



టెస్టులు చేస్తున్న వైద్యులు

కుల్కచర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 16 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా రాంపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళకు పాజిటివ్ వచ్చిందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ తెలిపారు. కోవిడ్ వైరస్ వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.దగ్గు, జలుబు, జ్వరం వంటివి మూడు రోజులకన్నా ఎక్కువగా ఉంటే వెంటనే కరోనా టెస్టులు చేయించుకోవాలన్నారు.

ఐపీఎల్‌లో ఒగ్గు డోలు దరువు



స్టేడియంలో డోలు వాయిస్తున్న బీరప్ప బృందం

బొంరాస్‌పేట: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో ఒగ్గుడోలు కళాకారులకు డోలు కొట్టే అవకాశం లభించింది. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌కు మద్దతుగా దరువేశారు. వీరిలో మండల పరిధిలోని నాందార్‌పూర్‌కు చెందిన ఒగ్గుడోలు బీరప్పతో పాటు కళాకారుల బృందం సభ్యులు శివ, రఘు, ప్రవీణ్, భద్రయ్య పాల్గొన్నారు.

నేటినుంచి 'డబుల్' దరఖాస్తుల పరిశీలన

కొడంగల్ రూరల్: డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం మార్చి 28 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించామని తహసీల్దార్ బుచ్చయ్య తెలిపారు. గడువు ముగిసే నాటికి మొత్తం 1,246 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. చివరి రోజైన సోమవారం 484 మంది అప్లికేషన్లు అందజేశారన్నారు. మంగళవారం నుంచి రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి పరిశీలిస్తారన్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్ అర్బన్: సబ్సిడీ లేని రుణాల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు, పురుషులతో పాటు, జనరల్ మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వ్యాపార, సేవ, తయారీ రంగాలలో కొత్త యూనిట్ల ప్రారంభానికి బ్యాంకుల ద్వారా సబ్సిడీ లేని రుణాలు అందించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త యూనిట్ల ఏర్పాటు కోసం బ్యాంకుల ద్వారా రూ.10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు రాయితీ లేని రుణాలు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు htt://www.rtand upmitra.in./ofin/Qefirterలో ఆన్‌లైన్‌లో ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదరు హార్డ్ కాపీని కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ బోధనకు పార్ట్‌టైమ్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తోల్‌కట్ట సమీపంలో ఉన్న ఈ కళాశాలలో దరఖాస్తు చేసుకునేవారు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు పొంది ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు విద్యార్హత జిరాక్స్ సర్టిఫికెట్ కాపీలను జత చేసి ఈ నెల 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'టెన్'షన్



తాండూరులోని ప్రభుత్వ నంబర్- 1 పాఠశాల

- పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన
- ప్రైవేటు పాఠశాలల పాత్రపై అనుమానాలు
- తాండూరులో ఎక్కడ చూసినా ఇదే చర్చ
- ఒకే పాఠశాలలో 13 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న బందెప్ప

తాండూరు: పదో తరగతి పరీక్ష పత్రం లీక్ వ్యవహారం తాండూరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. వార్షిక పరీక్షలు ప్రారంభమైన తొలిరోజునే ఈ ఘటన చోటుచేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పట్టణంలోని ప్రభుత్వ నంబర్- 1 పాఠశాలలో మొత్తం 630 మంది విద్యార్థులున్నారు. 13 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. పేపర్ లీక్ ఘటనలో ప్రధాన సూత్రధారిగా పేర్కొంటున్న ఉపాధ్యాయుడు బందెప్ప 2010నుంచి ఇక్కడే పనిచేస్తున్నాడు. ఇతని తీరుపై మొదటినుంచి అనేక ఆరోపణలున్నాయి. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడనే కారణంతో తల్లిదండ్రులు పలు మార్లు ఇతన్ని మందలించారు. అయినా బుద్ధి మార్చుకోకపోవడంతో పాఠశాలలోనే దాడిచేసి కొట్టారు. ఈ విషయమై విచారణ జరిపిన అధికారులు బందెప్పపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కుక్క తోక వంకర అనే చందంగా జైలుకు వెళ్లివచ్చినా కూడా అతనిలో మార్పు రాలేదనడానికి పేపర్ లీకేజీ వ్యవహారమే నిదర్శనంగా నిలుస్తోంది. పేపర్ లీకేజీ వార్తలను టీవీలు, సోషల్ మీడియాలో చూసిన తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. పరీక్ష రద్దు చేస్తారా..? తర్వాతి ఎగ్జామ్స్ పరిస్థితి ఏమిటి..? అని టెన్షన్ పడ్డారు.

నిబంధనలు బేఖాతరు

పరీక్ష సెంటర్లలోకి సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకెళ్లవద్దనే నిబంధన ఉంది. కానీ ఎగ్జామ్ ప్రారంభానికి ముందే సదరు ఉపాధ్యాయుడు బందెప్ప ఆఫీస్ రూంలో సెల్‌ఫోన్ ఉంచినట్లు సమాచారం. మరోవైపు ఇతను పేపర్ పంపించిన వ్యక్తి సమ్మప్ప తాండూరు మండల పరిధిలోని చెంగోల్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రశ్నపత్రాన్ని ఇతనికి ఎందుకు పంపించారనే విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేటు పాఠశాలల కోసమేనా?

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దొడ్డి దారిన ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇలాంటి అడ్డదారులు తొక్కుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు డబ్బు ఎరచూపి ప్రశ్నపత్రాలు సేకరిస్తున్నారని తెలుస్తోంది. ఇలాంటి వ్యవహారాల్లో పట్టణంలోని నాలుగు ప్రైవేటు స్కూళ్లు ప్రధాన భూమికి పోషిస్తున్నాయని సమాచారం. ఉపాధ్యాయుడు బందెప్ప కూడా ఇదే తరహాలో పేపర్ లీక్‌కు పాల్పడ్డాడా..? మరేవైనా ఇతర కారణాలున్నాయా..? అనే విషయాలు విచారణ తర్వాత పూర్తి స్థాయిలో బయటకు వచ్చే అవకాశముంది. ఏది ఏమైనా గౌరవ ప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న వారు ఇలాంటి చర్యలకు పాల్పడటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఎంఈఓ తీరుతోనే..

తాండూరు మండల విద్యాధికారి వెంకటయ్య ప్రభుత్వ నంబర్- 1 పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. హెచ్‌ఎం లేకపోవడంతో ఉపాధ్యాయుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఎంఈఓ అలసత్వం వల్లే పాఠశాలలో సమస్యలు నెలకొంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నీ అనుమానాలే..

పేపర్ లీకయ్యాక ఎంతమందికి.. ఎవరెవరికి వెళ్లింది..? దీన్ని వినియోగించి మాస్ కాపీయింగ్ జరిగిందా..? లీకేజీ వెనక అసలు ఉద్దేశం ఏమిటి..? పేపర్‌ను సమ్మప్పకు ఎందుకు పంపించాల్సి వచ్చింది..? పరీక్ష ప్రారంభమైన పది నిమిషాల్లోపే పేపర్ బయటకు వచ్చినా.. కాపీయింగ్ జరగలేదంటున్న అధికారుల మాటలు ఎంతవరకు నిజం..? అనే విషయాలు ప్రశ్నార్థకంగా మారాయి. మిగిలిన పరీక్షలైనా పకడ్బందీగా నిర్వహించకపోతే విద్యార్థుల భవితవ్యం ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దోషులకు కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రతీ ఊరికి రూ.50 లక్షల నిధులు



జినుగుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ ఊరికి రూ.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండా, గుండ్లమడుగుతండా, ఉద్దండాపూర్, మైసమ్మతండా, జినుగుర్తితండా, జినుగుర్తి, సిరిగిరిపేట్, వీరారెడ్డిపల్లి, రాంపూర్, రాంపూర్ మీదితండా, రాంపూర్ కింది తండాలో పర్యటించారు.ఈ సందర్భంగా పలు చోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వలతో పాటు అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. 15 రోజుల్లో పనులు ప్రారంభించి.. మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సర్పంచు అమృత్‌రెడ్డి, దశరథ్, పట్లోళ్ల రత్నమ్మ, కుర్వ నాగర్జున, ఎంపీటీసీ సీతాబాయి, నాయకులు రాందాస్, ఉమాశంకర్,రాంలింగారెడ్డి పాల్గొన్నారు.



చార్మినార్‌కు రంజాన్ శోభ

రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని పాతబస్తీ కళకళలాడుతోంది. చార్మినార్ పరిసరాల్లోని దుకాణాలు కొనుగోలుదారులతో రాత్రిపూట కొత్తదనంతో ఉట్టిపడుతున్నాయి. ప్రత్యేక ప్రార్థనలతో మక్కా మసీదు ఆధ్యాత్మికతను సంతరించుకుంది.



అక్రమార్కుల బరితెగింపు



గోనూరులో అక్రమ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

- గోనూర్ నుంచి యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- అధికార పార్టీ నేతల అండదండలతో దందా
- కేసులు నమోదు చేస్తున్నా వెనక్కి తగ్గని వైనం

తాండూరు రూరల్: తాండూరు మండలంలో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. ఇంటి నిర్మాణం కోసమని చెబుతూ.. ట్రాక్టర్లలో లోడ్ చేసిన ఇసుకను శివార్లలో డంప్ చేసి అమ్ముకుంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గోనూరు గ్రామ శివారులోని కాగ్నా నదిలో ఇసుక మేటలు పరుచుకున్నాయి. వేసవి కాలం వచ్చిందంటే చాలు అక్రమార్కుల కన్ను ఇసుకపై పడుతోంది. రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వాల్టా చట్టానికి యథేచ్ఛగా తూట్లు పొడుస్తున్నా వీరిని ఆపేవారే లేకుండా పోయారు.

పర్మిషన్ పేరుతో..

గోనూర్ గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా రెండు రోజుల క్రితం కరన్‌కోట్ పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేశారు. కానీ సదరు యజమాని మాత్రం తాను ఇంటి నిర్మాణం కోసం తహసీల్దార్ వద్ద పర్మిషన్ తీసుకున్నానని చెబుతూ నంబర్ లేని ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండటంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. నంబర్ లేని ట్రాక్టర్‌కు రెవెన్యూ అధికారులు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి, అధికార పార్టీ నాయకులు పీఎస్‌ఎకు వెళ్లి ట్రాక్టర్‌ను వదిలేయాలని కోరారు. ఇందుకోసం పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. ఈ విషయంలో ఎస్‌ఐ మాత్రం ఎవరి మాటా వినకుండా చట్టరీత్యా కేసు నమోదు చేశారు. పట్టుబడిన ట్రాక్టర్ పీఎస్‌లోనే ఉన్నప్పటికీ సదరు అక్రమార్కులు ఇతర వాహనాల ద్వారా ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు జుంటివాగు నుంచి ఇసుక తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

దొరికితే సీజ్ చేస్తాం



అనుమతి లేకుండా ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేస్తాం. ఇప్పటికే పలు వాహన యజమానులపై కేసులు నమోదు చేశాం. అయినా కూడా బరితెగించి వ్యవహరిస్తున్నారు. ఇసుక దోపిడీకి పాల్పడేవారెవరినీ వదలం.

– చిన్నప్పల నాయుడు, తహసీల్దార్

సూర్యప్రభావాహనంపై చిలుకూరు బాలాజీ

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు నాలుగోరోజు కొనసాగాయి. సోమవారం స్వామివారు సూర్యప్రభావాహనం, గరుడ వాహన సేవలు అందుకున్నారు. ఉదయం సూర్యప్రభావాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం గరుడవాహన సేవలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉద యం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేద పారాయణం, పూజలు, మంగళహారతి సేవలు నిర్వహించారు. రాత్రి 11 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. మంగళవారం గజవాహనంపై ఊరేగిస్తారని చెప్పారు.

మహనీయులను స్మరించుకుందాం

- వారి జయంతులను ఘనంగా నిర్వహిద్దాం
- కలెక్టర్ నారాయణరెడ్డి
- పలు అంశాలపై అధికారులతో సమీక్ష



తన సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు నమస్కరిస్తున్న ఓ పెద్దాయన

వికారాబాద్ అర్బన్: మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపైనా ఉందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్, 11న మహాత్మా జ్యోతిబాపూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజులను హాలిడేస్‌గా భావించకుండా అందరూ విధిగా హాజరు కావాలన్నారు. విగ్రహాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు రంగు వేయాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను వేడుకలకు ఆహ్వానించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు.

అర్హులను గుర్తించండి

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి, వారం రోజుల్లో అర్హులను గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో తహసీల్దార్లు, ఆర్డీఓలదే పూర్తి బాధ్యత అని తెలిపారు. ఇందుకు అవసరమైన టీంలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అర్హుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి అవకతవకలకు తావీయొద్దని ఆదేశించారు.

సెంటర్లను తనిఖీ చేయాలి

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సెంటర్లను సందర్శించి మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసేయాలని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందితో కేంద్రాలను శుభ్రం చేయించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని స్పష్టంచేశారు.

316 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి హాజరైన కలెక్టర్ వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజలను పలకరించారు. వారి సమస్యలను అడిగితెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ప్రజావాణికి మొత్తం 316 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వీటిని సత్వరమే పరిశీలించి, పరిష్కార మార్గాలు చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా శంకర్‌సింగ్


బాధ్యతలు స్వీకరిస్తున్న శంకర్‌సింగ్

తాండూరు: తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా శంకర్‌సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న ఆర్డీఓ అశోక్‌కుమార్ రిలీవ్ అయ్యారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్‌సింగ్‌ను తాండూరు మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం వారం రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బడ్జెట్ పద్దులను ఆమోదిండచంలో కీలకంగా వ్యవహరించారు. దీంతో శంకర్‌సింగ్ పని తీరుకు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పరీక్ష కేంద్రంలో చోరీ


దుండగులు ధ్వంసం చేసిన ట్రంకు పెట్టె

కొడంగల్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గుర్తు తెలియని దుండగులు సీసీ కెమెరాలు ఎత్తుకెళ్లారు. ఉపాధ్యాయులు తెలిపిన ప్రకారం .. పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పరీక్ష కేంద్రానికి సీసీ కెమెరాలు తీసుకువచ్చారు. వీటిని ఓ గదిలో భద్రపరిచారు. ఆదివారం రాత్రి దుండగులు పాఠశాల గది తలుపులు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. ఆగదిలో ఉన్న ట్రంకుపెట్టెను ధ్వంసం చేసి సీసీ కెమెరాలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి

తహసీల్దార్‌కు ప్రజాసంఘాల వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: ఏళ్ల నుంచి ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో తహసీల్దారు షర్మిలకు ప్రజాసంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని కొత్తూరులో కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, కొంతమంది రైతులకు ఇంకా పట్టాలు అందలేదని చెప్పారు. మిగిలిన రైతులకు తప్పనిసరిగా పట్టాలు అందజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ ఉన్నతాధికారులకు అందజేసి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ నాయకులు చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘాల నాయకులు కొత్తూరు చంద్రయ్య, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతేనా..?

- అవార్డుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ సర్పంచ్‌ల ఆరోపణ
- అవార్డు అందుకున్న పంచాయతీ కార్యదర్శి సస్పెండ్


ఎమ్మెల్యే యాదయ్య చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చిట్టిగిద్ద సర్పంచ్, కార్యదర్శి (ఫైల్)

నవాబుపేట: ఇటీవల ప్రకటించిన ఉత్తమ గ్రామ పంచాయతీల అవార్డుల ప్రదానం విమర్శలకు తావిస్తోంది. ఉత్తమ పంచాయతీల ఎన్నికల్లో అధికారులు పక్షపాతంగా వ్యవహరించారని, పనులు పూర్తి చేసిన పంచాయతీలను పక్కను పెట్టి ఇతర పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేశారని పలు గ్రామాల సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, రాజకీయ ఒత్తిళ్ల నడుమ ఉత్తమ పంచాయతీల ఎంపిక నిర్వహించారని ఆరోపిస్తున్నారు.

అపరిశుభ్రంగా 'క్లీన్ అండ్ గ్రీన్' గ్రామం

ఇటీవల అవార్డుల ప్రదానంలో మండల పరిధిలోని మీనపల్లికలాన్ గ్రామానికి క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో మండల అవార్డు వరించింది. ఈ గ్రామాన్ని ఇటీవల (అవార్డు పంపిణీ అనంతరం) మార్చి 29న జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి సందర్శించారు. ఈ క్రమంలో గ్రామంలో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి పంచాయతీ కార్యదర్శి సుజిత్ కుమార్ పనితీరు బాగోలేదని అతన్ని సస్పెండ్ చేయాలని కలెక్టర్‌కు సిఫారసు చేయగా అదేరోజు సస్పెండ్ చేశారు. అవార్డు అందుకున్న నాలుగు రోజులకే పనితీరు బాగోలేదని సస్పెండ్ చేయడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంటే అవార్డు ఎలా ఇచ్చారని పలుగ్రామాల సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు.

ఆరోగ్యకరమైన గ్రామంలో అస్తవ్యస్తం

చిట్టిగిద్ద గ్రామానికి ఆరోగ్యకరమైన పంచాయతీ అని ఇటీవల అవార్డు ఇచ్చారు. గ్రామంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలు, మురుగు కాల్వలు నిండిపోయి ఉండడం, రోడ్లపైనే మురుగు పారుతుండడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఏం చూసి ఆరోగ్యరమైన పంచాయతీ అని అవార్డు ఇచ్చారో చెప్పాలని వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవార్డు వచ్చిన అనంతరం పనులు చేపడుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

సమస్యాత్మక గ్రామానికి 'ఎస్ఎస్‌పీ' అవార్డు

మాదారం గ్రామానికి సామాజిక భద్రత(ఎస్ఎస్‌పీ) అవార్డు ఇచ్చారు. కానీ ఈ గ్రామం నుంచి పోలీస్‌స్టేషన్‌లో ప్రతీ వారం రెండు, మూడు ఫిర్యాదులు వస్తుంటాయి. తాగునీటి బావిలో విష గుళికలు కలుపుతున్న ఘటనలు ప్రతీ సంవత్సరం జరుగుతున్నాయి. దీంతో ఈ పంచాయతీ ఎస్ఎస్‌పీ అవార్డు ఇవ్వడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఇటీవల ఇచ్చిన అవార్డుల్లో పూర్తిగా పక్షపాతంగా వ్యవహరించారని.. గ్రామాలను ఉన్నతంగా తీర్చిదిద్దిన పంచాయతీలకు అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలి కానీ.. అధికారులు పని చేయని పంచాయతీలకు అవార్డులు ఇవ్వడం సరికాదని పలుగ్రామాల సర్పంచ్‌లు ఆగ్రవ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ ప్రపోజల్స్ పంపించాం

ఉత్తమ గ్రామ పంచాయతీల ఎంపిక మండల స్థాయిలో జరగలేదు. పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో చేసిన పలు విషయాలకు సంబంధించిన 9 అంశాలపై ఆన్‌లైన్‌లో ప్రపోజల్స్ పంపమన్నారు. వారు పంపిన అంశాలను పరిగణలోకి తీసుకుని అవార్డులు ప్రకటించారు. అవార్డుల ప్రదానంలో ఎలాంటి పక్షపాతం చూపలేదు.

– సుమిత్రమ్మ, ఎంపీడీఓ,నవాబుపేట

అభివృద్ధికి తొలగిన అడ్డంకులు

- మూడేళ్ల తర్వాత రెండేళ్ల బడ్జెట్‌కు ఆమోదం
- అధికారుల సమక్షంలో సజావుగా సాగిన కౌన్సిల్ సమావేశం


అదనపు కలెక్టర్, చెర్‌పర్సన్, కమిషనర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమావేశం

తాండూరు: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రవేశపెట్టిన రెండు వార్షిక బడ్జెట్‌లను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సోమవారం చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ అధ్యక్షతన 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల బడ్జెట్ ఆమోదానికి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, నూతన కమిషనర్ శంకర్ సింగ్ పర్యవేక్షణలో సమావేశం సాఫీగా సాగింది. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అభ్యంతరాలు వ్యక్తం చేయగా.. ఇతర కౌన్సిలర్లు వ్యతిరేకించారు. రెండేళ్లుగా బడ్జెట్ ఆమోదం లేక వార్డుల్లో అభివృద్ధి నిలిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కౌన్సిల్ సభ్యులంతా రెండు ఆర్థిక బడ్జెట్‌లకు ఆమోదం తెలిపారు. గతేడాది వివాదాలతో నిలిచిపోయిన 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.60.28 కోట్లను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం 2023–24 ఆర్థిక బడ్జెట్‌రూ 55.41కోట్ల నిధులతో కౌన్సిల్‌లో ప్రవేశపెట్టగా మొత్తంగా రూ.115.69కోట్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఆస్తి పన్ను నుంచి రూ.12.94కోట్లు, నాన్ ట్యాక్సెస్ నుంచి రూ.8.60కోట్లు ద్వారా ఆదాయం సమకూరుతోంది. అయితే గ్రీన్ బడ్జెట్‌కు ఆదాయంలో 10 శాతం కేటాయించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపనర్సింహులు, మేనేజర్ నరేందర్‌రెడ్డి, డీఈఈ రంగనాథం, ఏఈ ఖాజాహుస్సేన్, ఫ్లోర్ లీడర్లు బొబ్బిలి శోభారాణి, అంతారం లలిత, మధుబాల, సాజిద్‌అలీ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి

తాండూరు మున్సిపాలిటీలో బడ్జెట్ ఆమోదం పొందింది. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి. ప్రభుత్వం నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

– రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్

సంతోషంగా ఉంది

తాండూరు మున్సిపాలిటీకి రెండేళ్లుగా పట్టిన శని వదిలింది. గతేడాది ఆర్థిక బడ్జెట్ ఆమోదంలో అధికారుల మద్దతు కరువైంది. అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, కమిషనర్ శంకర్‌సింగ్‌ల ఆధ్వర్యంలో రెండు బడ్జెట్‌లు ఆమోదం పొందడం సంతోషంగా ఉంది.

– తాటికొండ స్వప్నపరిమళ్, మున్సిపల్ చైర్‌పర్సన్, తాండూరు

పన్ను చెల్లింపులో ఐదు శాతం రాయితీ

మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి


వ్యాపారి నుంచి చెక్కు తీసుకుంటున్న కమిషనర్

కొడంగల్: ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు. పన్ను వసూలులో భాగంగా సోమవారం ఆయన పట్టణంలో పర్యటించారు. మొండి బకాయి ఉన్న ఇంటి యజమానులతో మాట్లాడారు. సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ ప్రకటించిందన్నారు. మున్సిపల్ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సోమవారం పట్టణంలోని ఒక వ్యాపారి నుంచి రూ.1,08,258 పన్ను వసూలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం రాయితీని మినాహాయించి చెక్కులు తీసుకున్నారు. ఈ నెల 30లోగా ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు క్రాంతి, నాగరాజు, ఆశప్ప, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు పంట రుణాలు

- రూ.80 లక్షల నిధులతో గోదాం నిర్మాణం
- పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి


పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

పెద్దేముల్: అర్హులైన ప్రతీ రైతుకు పంట రుణాలు అందజేస్తామని.. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తట్టెపల్లి ప్రాథమిక సహకార సంఘం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎరువుల సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పది రోజుల్లో రైతుల షేర్ డబ్బులు ఇవ్వాలని చైర్మన్ సీఈఓ రాజమౌళికి ఆదేశాలు జారీ చేశారు. గతంలో అసైండ్ భూములకు ఇచ్చే పంట రుణాలు నిలిపివేశామని చెప్పారు. రైతులకు ఎరువుల సమస్యలు తలెత్తకుండా రూ.80లక్షల నాబార్డు నిధులతో గోదాం నిర్మించేందుకు నిర్ణయించామన్నారు. పది ఎకరాలు ఉన్న రైతులు పౌల్ట్రీ ఫాంలు, ట్రాక్టర్లు ఆర్థిక సహకారం ఇచ్చేందుకు సంఘం సిద్ధంగా ఉందని వివరించారు. సంఘం సభ్యులు మరణిస్తే వారి షేర్ డబ్బులను ఆ కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆధారంగా అందజేస్తామన్నారు. చిరు వ్యాపారులు ప్రభుత్వ ఉద్యోగి షూరిటీ ఆధారంగా రూ.లక్ష వరకు రుణం మంజూరు చేస్తామని వివరించారు. క్రాఫ్ రుణాలు తీసుకున్న రైతులు వాయిదాలు సకాలంలో చెల్లించాలన్నారు. చెరుకు పంట సాగుచేసుకున్న రైతులకు ఎకరాకు రూ.50వేల వరకు రుణం అందిస్తామన్నారు. మాజీ డైరక్టర్ ప్రభుకుమార్ మాట్లాడుతూ.. రైతుల షేర్ డబ్బులు గత సర్వసభ్య సమావేశంలో ఇవ్వాలని చెప్పినా సీఈఓ ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. మళ్లీ సమావేశం వరకు రైతుల షేర్ డబ్బులు అందజేసేలా చైర్మన్ చర్యలు తీసుకోవాలని కోరారు. తట్టెపల్లి గ్రామానికి చెందిన రవి తీసుకున్న రుణం చెల్లించినప్పటికీ షేర్ డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించడంతో సత్వరమే చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సంఘం ఉపాధ్యక్షుడు అంజయ్య, బీసీసీబీ మాజీ డైరక్టర్ నారాయణగౌడ్, సీఈఓ రాజమౌలి, ఎంపీటీసీ సభ్యుడు శంకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మణ్ పాలక వర్గం సభ్యులు మల్లేశం, దిగంబర్, బస్వరాజ్, రహీం, శ్రీదేవి, వివిధ గ్రామాల రైతులు సంఘం సభ్యులు జగన్, ఏసు, అంజప్ప, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

52 శాతం రిజర్వేషన్ ఇచ్చే వరకు పోరాటం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ


జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న నేతలు

పరిగి: చట్ట సభల్లో బీసీలకు 52శాతం రిజర్వేషన్ కల్పించేంత వరకు పోరాటం కొనసాగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ అన్నారు. సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో పరిగి ప్రాంతానికి చెందిన బీసీ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ధర్నాలో పాల్గొన్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం లాల్‌కృష్ణ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన ధర్నాలో పాల్గొంటామన్నారు. చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ జనగణన చేసేందుకు కేంద్రం ఎందుకు వెనుకడుగు వేస్తోందో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రం స్పందించి చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు హన్మంతుముదిరాజ్, ఆంజనేయులు, చిన్న నరసింహులు, మల్లేశ్, వెంకటేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ్ సమాఖ్య ఉపాధ్యక్షుడి నియామకం


నియామకపత్రం అందుకుంటున్న పురుషోత్తంరావు

తాండూరు: బ్రాహ్మణ సేవా సంఘ్ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాండూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కరణం పురుషోత్తంరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో బ్రాహ్మణ గర్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ సమాఖ్య అధ్యక్షుడు జగన్మోహన్ శర్మ పురుషోత్తంరావును ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ప్రకటించి నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రమణాచారి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇది పేపర్ లీకేజీల ప్రభుత్వం

ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్


మాట్లాడుతున్న రమేశ్ మహరాజ్

తాండూరు: సీఎం కేసీఆర్ పాలనలో పేపర్ లీకేజీలు సర్వసాధరణమయ్యాయని.. ఇది పేపర్ లీకేజీల ప్రభుత్వమని ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాండూరులో పదోతరగతి పరీక్ష పత్రం లీక్ అవ్వడం దురదృష్టకరమన్నారు. తెలంగాణలో ఏ పరీక్షలు పెట్టినా లీకేజీల జాతర నడుస్తోందని ఎద్దేవా చేశారు. పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించ లేని ప్రభుత్వంలో కొనసాగడం సిగ్గుచేటన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలకు తొత్తులుగా మారి నీచపు చర్యలకు పాల్పడుతున్నట్లు అనుమానాలున్నాయన్నారు. పేపర్ లీకేజీపై ప్రభుత్వం భాద్యత వహించి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయన్నారు. పేపర్ లీక్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బషీరాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేశ్ మహరాజ్, నాయకులు జనార్దన్ రెడ్డి, నర్సింహులు తదితరులున్నారు.

బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు అన్యాయం

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు క్రాంతికుమార్


కార్పొరేషన్ రుణాల పెండింగ్ జాబితాను చూపుతున్న క్రాంతికుమార్

అనంతగిరి: బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు క్రాంతి కుమార్ అన్నారు. సోమవారం ఆయన వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని తొర్మామిడి రోడ్డు పూర్తిగా పాడైన పట్టించుకునే వారే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి నిధుల విడుదలకు చర్యలు తీసుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. అనర్హులకు దళితబంధు ఇవ్వడం సరికాదన్నారు. కార్పొరేషన్ రుణాలు ఇప్పించడంలో ఈ ప్రాంత ప్రజాప్రతినిదులు విఫలమయ్యారని మండిపడ్డారు. టీఎస్ఐపాస్ కింద వాహనాలు కొనుగోలు చేసిన లబ్ధిదారులు సబ్సిడీలు అందక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీలోని గ్రూపు తగాదాల కారణంగా అభివృద్ధి కుంటుంపడుతోందని ఆరోపించారు. సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి అరుణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి శిశువు మృతి


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బాలుడి బంధువులు

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- జాతీయ రహదారిపై రాస్తారాకో

షాద్‌నగర్ రూరల్: వైద్యం వికటించి నాలుగు నెలల బాలుడు మృతి చెందిన ఘటన షాద్‌నగర్ పట్టణంలోని స్టార్ కిడ్జ్ ఆస్పత్రిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాంనగర్ కాలనీకి చెందిన నరేందర్, కీర్తన దంపతులకు నాలుగు నెలల బాలుడు ఉన్నాడు. రెండు రోజులుగా బాలుడు దగ్గు, జ్వరం, జలుబుతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు సోమవారం పట్టణంలోని స్టార్ కిడ్జ్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల చికిత్స అనంతరం బాలుడి మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యం వికటించడం వల్లే బాలుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న బంధువులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ఎదుట, పాత జాతీయ రహదారిపై బైఠాయించి రెండు గంటల పాటు రాస్తారోకో చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు.

అధికారుల ఆకస్మిక తనిఖీ

- మోతాదుకు మించి రసాయనాలు వాడుతున్న పలువురి గుర్తింపు
- నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..


మార్కెట్‌లో పండ్ల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ కంట్రోలర్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం పండ్ల మార్కెట్‌లో రాష్ట్ర ఫుడ్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ శివలీల ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా రసాయనాల ద్వారా పండ్ల పండిస్తున్నారని 'సాక్షి' దినపత్రికలో 'మామిడి విషతుల్యం!' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన ఫుడ్ కంట్రోల్ అధికారులు మార్కెట్‌లోని మామిడి పండ్ల యార్డులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. యార్డులోని ప్రతీ మామిడి పండ్ల బాక్స్‌లను క్షుణంగా పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. అధికారుల తనిఖీల్లో పలువురు ఏజెంట్లు నిబంధనలకు విరుద్ధంగా మోతాదుకు మించి రసాయనాలు వాడుతున్న పలువురిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మార్కెట్ ఆవరణలోని కార్యాలయంలో మార్కెట్ కార్యదర్శి చిలుక నర్సింహారెడ్డితో కలిసి కమీషన్ ఏజెంట్లకు, వ్యాపారులకు, ఎగుమతిదారులకు చట్ట ప్రకారం ఎలా రిఫైనింగ్ చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ విజయ్ కుమార్, ఫుడ్ కంట్రోలర్ అధికారులు లక్ష్మీనారాయణరెడ్డి, ఎంఏ ఖలీల్, ఉదయ్‌కిరణ్, ఈశ్వర్ రాథోడ్, హర్షిత, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఒకరికి గాయాలు

ఆమనగల్లు: ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడ్తాల మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన అనంతరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. మర్రిపల్లికి చెందిన అనంతరెడ్డి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం ఆమనగల్లు పట్టణంలోని విద్యుత్ కార్యాలయానికి వచ్చాడు. అనంతరం బైక్‌పై మర్రిపల్లి వెళ్లడానికి జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొనడంతో అనంతరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.